

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు'

తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శుక్రవారం 25 సెప్టెంబరు 2026 | సంపుటి : 01, సంచిక : 04 | పేజీలు : 04, వెల రూ.2

బందరు అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం.. పేర్నినానికి కొల్లు రవీంద్ర హెచ్చరిక



మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

బందరు అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

కృష్ణా జిల్లా, సెప్టెంబర్ 24: మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బందరు అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. బందరు అభివృద్ధిని, బందరు నాశనాన్ని కోరుకునే ఏకైక వ్యక్తి పేర్ని నాని అంటూ ఫైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వ కృషి ఫలితంగా బందరుకు రూ.8 వేల కోట్లతో గోవా షిప్ యార్డ్ వస్తోందని తెలిపారు. గోవా షిప్ యార్డ్ ఏర్పాటు ద్వారా 10వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. బలవంతంగా భూములు లాక్కుంటారని రైతుల్లో అలజడులు సృష్టించేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వ్యక్తులను బందరు ప్రజలు ఓ కంటి కనిపెట్టాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టినా పేర్ని నాని చిల్లరి రాజకీయాలు మానలేదని విమర్శించారు. మిగతా..2లో

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో

సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 24: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మిగతా..2లో

కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



- కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్
- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పిఠాపురం సుద్దగడ్డ వాగు, ఉప్పాడ తీర ప్రాంత పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన

అమరావతి : తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత

ఏపీలో వర్ష బీభత్సం - యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని
సీఎం చంద్రబాబు ఆదేశం

- భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు మరోసారి టెలీకాన్ఫరెన్స్
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు మరోసారి టెలీకాన్ఫరెన్స్



హైదరాబాద్: భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. నీటి ఉధృతితో దెబ్బతిన్న రహదారులను తక్షణమే పునరుద్ధరించాలని, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. చెరువులు నింపడంతో పాటు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరద పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ ప్రజలకు అవసరమైన సహాయం వెంటనే అందించాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్‌లో

వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష : వర్షాలతో వస్తున్న ప్రతి నీటి ప్రవాహాన్ని ఒడిసిపట్టి రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు, ఇతర నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సాయంత్రం ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం వర్షాలు, నీటి ప్రవాహాలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట మొబైల్ లిఫ్ట్‌లు, మోటార్లను వినియోగించి నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని స్పష్టం చేశారు. మిగతా..2లో

స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై
జగన్ కీలక సూచనలు

- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్
- ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను మిగతా..2లో

ఎయిర్ ఇండియా బంపర్ ఆఫర్.. విమాన ఛార్జీలపై 10 శాతం డిస్కౌంట్..



- ఈ ఆఫర్ అక్టోబర్ 20, 2026 వరకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక బుకింగ్
- ఈ విద్యార్థి ఆఫర్‌ను పొందడానికి విద్యార్థులు కనీసం 12 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి.

ఫెస్టివల్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విద్యార్థుల కోసం ఒక ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద విద్యార్థులు దేశీయ విమాన టికెట్ ధరలపై

ఓటింగ్ వ్యవస్థను ధ్వంసం చేసిన జ్ఞానేశ్ కుమార్
వెంటనే రాజీనామా చేయాల్సిందే

- ప్రభుత్వం తీసుకువచ్చే ఏ మార్పు అయినా అన్యాయంగా ఉంటోందన్న కాంగ్రెస్ అగ్రనేత
- జ్ఞానేశ్‌కుమార్‌ను ఈసీగా ప్రధాని, హోంమంత్రి ఎన్నుకున్నారని గుర్తుచేసిన రాహుల్ గాంధీ



ఢిల్లీ : భారత ఓటింగ్ వ్యవస్థను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ధ్వంసం చేశారని, ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశానికి వ్యతిరేకంగా జ్ఞానేశ్ కుమార్ పనిచేస్తున్నారని, ఆయనను అతని పరిరక్షకులు కాపాడుతున్నారని ఆరోపించారు. ఓటు చోరీ గురించి ఈసీలకు ముందే తెలుసని, అన్ని ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యాయని మండిపడ్డారు. ఈ మేరకు దిల్లీలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేశ్‌కుమార్‌ను ఈసీగా ప్రధాని, హోంమంత్రి ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఆయనపై ఇద్దరు ఈసీలు ప్రశ్నలు సంధిస్తున్నారని, మిగతా..2లో

భారత సముద్ర మార్గం నుంచి
అమెరికాపై దాడులు చేస్తాం

- ఐక్యరాజ్యసమితి సాధారణ సభ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి చేసిన హెచ్చరికలపై ఆ దేశం తీవ్రంగా స్పందించింది.
- ఇరాన్ తన సైనిక వ్యూహాలను మార్చుకుంటున్నట్లు ప్రకటించింది.



వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి చేసిన హెచ్చరికలపై ఆ దేశం తీవ్రంగా స్పందించింది. అమెరికా తమపై మళ్లీ దాడులకు దిగితే, ఈ యుద్ధాన్ని హిందూ మహాసముద్రం వరకు విస్తరిస్తామని

తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్.. తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్



బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు

- ఏపీ, తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్ నియామకం
- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్ బాధ్యతలు
- ఆంధ్రప్రదేశ్‌తో సహా 5 రాష్ట్రాలకు జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్
- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శుల నియామకం

హైదరాబాద్: బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది.

సర్‌పై ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలి

- ఓటర్ల హక్కుల విషయంలో పారదర్శకత అవసరం
- బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల వెలుగులోకి వచ్చిన అంశాలు ప్రజల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలను కలిగిస్తున్నాయని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన బాధ్యత అని చెప్పారు. గత పది నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చిందంటూ వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలను కూడా స్పృశిస్తున్నాయన్నారు.

ఫారం-6లో మార్పులపై స్పష్టత ఇవ్వాలి

కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో ఎస్ఐఆర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలన్నారు. ఫారం-6 నిబంధనల ప్రకారం నిర్దేశించిన చట్టబద్ధమైన ఫారం అయితే అందులో మార్పులు చేయడానికి ఏ ప్రక్రియను అనుసరించారు.. ఎవరి అనుమతితో మార్పులు చేశారు.. ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు పొందే యువతకు అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

ఈసీఐ నెట్, ఓటర్ల డేటాపై పారదర్శకత అవసరం

ఈసీఐ నెట్ వంటి కేంద్రీకృత మిగతా..2లో

క్షుద్ర పూజలు చేశానంటూ
తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ నేతలపై హరీశ్ రావు ఫైర్



- క్షుద్ర పూజలు చేశానని కాంగ్రెస్ పార్టీ నేతలు తనపై తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై అన్ని సాక్ష్యాధారాలతో కేసు ఫైల్ చేశానని చెప్పారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 24: క్షుద్ర పూజలు చేశానని

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల
ఎంపికపై జగన్ కీలక సూచనలు

గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బందరు అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం..
పేర్నినానికి కొల్లు రవీంద్ర హెచ్చరిక

మెగా డీఎస్సీ ద్వారా 16,300 మందికి ఉద్యోగాలు ఇస్తే టీచర్లపై దాడి చేయించిన విష సంస్కృతి వైసీపీది అంటూ విరుచుకుపడ్డారు. ఆనాడు తాము చేసిన పోర్టు ఉద్యమానికి సాక్షాత్తు వైఎస్ రాజశేఖరరెడ్డి దిగొచ్చారని మంత్రి గుర్తుచేశారు. తాము పోర్టు పనులు చేస్తే, జగన్ వచ్చాక పనులను నిలిపివేశారని వ్యాఖ్యానించారు. మళ్లీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టు పనులను వేగవంతం చేశామన్నారు. 2027 మార్చి నాటికి పోర్టు పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. పోర్టుకు అనుబంధంగా గోవా షిప్ యార్డ్ రాబోతుందని వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు మచిలీపట్నానికి రానున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్..
తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్కులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

ఓటింగ్ వ్యవస్థను ధ్వంసం చేసిన జ్ఞానేశ్ కుమార్
వెంటనే రాజీనామా చేయాల్సిందే

తాను అడిగిన ప్రశ్నలకు జవాబు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చే ఏ మార్పు అయినా అన్యాయంగా ఉంటోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం ధ్వంసమవుతుంటే చూస్తూ ఊరుకోమని తేల్చిచెప్పారు. ఎన్‌డీఏ నేతృత్వంలో రాజ్యాంగం అపహాస్యం పాలవుతోందని, భారత ఐడియాలజీపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత సముద్ర మార్గం
నుంచి అమెరికాపై దాడులు చేస్తాం

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సీనియర్ సలహాదారు యాహ్యా రహీమ్ సఫావీ హెచ్చరించారు. ఇరాన్‌ను నామరూపాలు లేకుండా ధ్వంసం చేస్తామని ట్రంప్ చేసిన ఘాటు వ్యాఖ్యలకు బదులుగా.. ఇరాన్ తన సైనిక వ్యూహాలను మార్చుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు పర్షియన్ గల్ఫ్, ఎర్రసముద్రంలోని హర్ముజ్ జలసంధి వరకే పరిమితమైన దాడులు.. భవిష్యత్తులో అమెరికా స్థావరాలు, యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుని హిందూ మహాసముద్రం నుంచి తిప్పికొడతామని సఫావీ పేర్కొన్నట్లు ఇరాన్‌కు చెందిన ఫార్ న్యూస్ ఏజెన్సీ ప్రసారం చేసింది. అమెరికా కవ్వింపు చర్యలు, ఆర్థిక ఆంక్షలు, నౌకాశ్రయాల దిగ్బంధాన్ని తిప్పికొట్టేందుకే ఈ వ్యూహాత్మక మార్పు చేస్తున్నట్లు ఇరాన్ ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది.

భారత సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు

సఫావీ హెచ్చరికలతో గల్ఫ్ ఆఫ్ ఓమన్, పర్షియన్ గల్ఫ్‌తో పాటు భారత సముద్ర భూభాగమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఐరోపాను ఆసియాతో కలిపే బాబ్ అల్-మండెబ్ జలసంధి, ఎర్రసముద్రం, గల్ఫ్ ఆఫ్ ఆడెన్ తదితర సముద్ర రవాణా మార్గాల్లో నెలకొన్న ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది.

ఎయిర్ ఇండియా బంపర్ ఆఫర్..
విమాన ఛార్జీలపై 10 శాతం డిస్కౌంట్..

10 శాతం డిస్కౌంట్‌తో పాటు, అదనపు లగేజ్ సదుపాయం మరియు తక్కువ ధరకు డేట్ మార్చుకునే వెసులుబాటును పొందవచ్చు. ఈ ఆఫర్ అక్టోబర్ 20, 2026 వరకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక బుకింగ్ ఛానెళ్ల ద్వారా అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక ఆఫర్ కింద విద్యార్థులకు దేశీయ వాల్యూ ఫేర్లపై 10 శాతం తగ్గింపు లభిస్తుంది. సాధారణంగా ఉండే 15 కిలోల లగేజ్ కు బదులుగా విద్యార్థులు ఏకంగా 25 కిలోల వరకు లగేజ్‌ను ఉచితంగా తీసుకెళ్లవచ్చు. అంటే ఇందులో అదనంగా 10 కిలోల లగేజ్ వెసులుబాటు లభిస్తుంది. అంతేకాకుండా.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకునే విద్యార్థులు కేవలం రూ. 99 చెల్లించి తమ ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా డొమెస్టిక్ లేదా ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ బుక్ చేసుకునే కస్టమర్లు ' కోడ్‌ను ఉపయోగించి అదనంగా మరో 5 శాతం డిస్కౌంట్ పొందవచ్చని ఎయిర్ లైన్స్ తెలిపింది. అయితే ఇందుకు కొన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి. ఈ విద్యార్థి ఆఫర్‌ను పొందడానికి విద్యార్థులు కనీసం 12 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. ప్రయాణ సమయంలో గుర్తింపు పొందిన విద్యా సంస్థ జారీ చేసిన సరైన స్టూడెంట్ ఫోటో ఐడీ కార్డ్‌ను విధిగా కలిగి ఉండాలి. ఈ ఐడీ కార్డ్‌పై విద్యార్థి పేరు , పుట్టిన తేదీ స్పష్టంగా ఉండాలి. ఎయిర్‌పోర్టులో చెక్-ఇన్ చేసే సమయంలో ఈ ఐడీ కార్డ్‌ను చూపించాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆఫర్‌తో పాటు.. అర్హత కలిగిన వీసా డెబిట్ లేదా క్రెడిట్ కార్డులను ఉపయోగించి చేసే దేశీయ, అంతర్జాతీయ విమాన బుకింగ్‌లపై రూ. 600 వరకు తగ్గింపును కూడా ఎయిర్‌లైన్స్ అందిస్తోంది.

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి



భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

సర్‌పై ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి



ఐటీ వ్యవస్థ ద్వారా ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన ఈఆర్వోల పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని మంత్రి పొన్నం కోరారు. ఓటర్ల డేటా ఎవరు మార్చారు.. ఎప్పుడు మార్చారు.. ఏ కారణంతో మార్చారు.. ఏ అధికారి అనుమతితో మార్చారు అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలన్నారు. అవసరమైన మేరకు ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థల విషయంలో భద్రతా ప్రమాణాలు, అధికారాల విభజన, జవాబుదారీతనం వంటి అంశాలపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

ఓటర్ల పేర్ల తొలగింపుపై పూర్తి వివరాలు వెల్లడించాలి

'సర్' ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనట్లు నివేదికలు వెలువడ్డాయని, తొలగింపు ఏ కారణాలపై జరిగింది.. ఎంతమంది పేర్లు తొలగించారు.. ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు.. ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు అనే వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా బహిరంగపరచాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అనే విషయం రాజకీయ వాదోపవాదాల ద్వారా తేలదన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పూర్తి డేటా, తొలగింపుల వివరాలు, కొత్తగా చేర్చిన పేర్లు, అభ్యంతరాలు, అప్పీళ్ల పరిష్కారం వంటి సమాచారాన్ని ప్రజల ముందుంచాలని కోరారు.

పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి

జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నదన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చూడాలని మంత్రి పొన్నం సూచించారు. అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ వివిధ స్థాయిల్లో నమోదైన అభ్యంతరాలపై పూర్తి వివరాలను బహిరంగపరచడం ద్వారా ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడేలా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగింపునకు గురికాకుండా చూడటం ఎంత ముఖ్యమో అనర్హుల పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం: కాంగ్రెస్ నేతలపై హరీశ్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ పార్టీ నేతలు తనపై తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై అన్ని సాక్ష్యాధారాలతో కేసు ఫైల్ చేశానని చెప్పారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. తన పిటిషన్‌ను కోర్టు అనుమతించిందని అన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన తన స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తామని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద ఆయన మాట్లాడారు. తనపై అసత్య ప్రచారాల డెఫర్మేషన్ (పరువు నష్టం) కేసు ఫైల్ చేశానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని కాంగ్రెస్ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లైనా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదని ఆరోపించారు. సభ హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇచ్చినా స్పీకర్ పట్టించుకునే పరిస్థితి లేదని పెదవి విరిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అబద్ధాలు తప్ప.. చేసింది ఏమి లేదని అన్నారు. తన విషయంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. భవిష్యత్తులో అబద్ధాలు ప్రచారం చేస్తే ఎవరిని వదలమని స్పష్టం చేశారు. దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని అభివర్ణించారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. రాజ్యాంగం సంరక్షకుడిగా వ్యవహరిస్తున్నాడని మరి ఇప్పుడు ఏమైందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎవరైతే పార్టీలు మారారో.. ఆ శాసనసభ్యులందరితో రాజీనామా చేయించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అయినా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కనువిప్పు కావాలని హరీశ్ రావు పేర్కొన్నారు. పార్టీ మారిన శాసన సభ్యులందరికీ.. దానం నాగేంద్ర తీర్పు ఎదురవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పు చేసిందని ప్రజలు తెలుసుకున్నారని అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రయత్నించారని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు చేయాలని ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్.. తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్

మొదటి పేజీ తరువాయి



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్కులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

ఏపీలో వర్ష బీభత్సం - యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశం

మొదటి పేజీ తరువాయి



గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లలో పెరుగుతున్న ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయం, భూసార పెంపు, ఏఐ ఆధారిత డేటా విశ్లేషణను పైలట్‌గా అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలి : భారీ వర్షాలు దృష్ట్యా వరద నియంత్రణ చర్యల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇరిగే

చెత్త రాజకీయాలు మానుకోండి ... వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాలవ హెచ్చరిక

రాయదుర్గం,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:వైసీపీ నేతలు చెత్త రాజకీయాలు మానుకుని రాయదుర్గం అభివృద్ధిని చూడాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. రాయదుర్గం పట్టణంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న చెత్త శుద్ధీకరణ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. దశాబ్దాలుగా పట్టణంలో పేరుకుపోయిన సుమారు లక్ష టన్నుల చెత్తను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శుద్ధీ చేస్తోందన్నారు. ఇప్పటివరకు 87 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేశామని,మిగిలిన చెత్తను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.భవిష్యత్తులో డంపింగ్ యార్డును పరిశుభ్రమైన ప్రదేశంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకరమైన పార్కును అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు తీసుకొచ్చి రాయదుర్గం అభివృద్ధికి కృషి చేస్తుంటే, వైసీపీ నేత మెట్టు గోవిందరెడ్డి చెత్త అంశంపై రాద్ధాంతం చేస్తూ పట్టణ ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.గడచిన రెండేళ్లలో చెత్త శుద్ధీకరణకు కూటమి ప్రభుత్వం చేసిన ఖర్చు కంటే,ఐదేళ్ల వైకాపా పాలనలో రాయదుర్గం అభివృద్ధికి చేసిన ఖర్చు చాలా తక్కువని గణాంకాలతో వివరించారు.డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను శుద్ధీకరించేందుకు



రూ.8.54 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న సుమారు 29 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు,మరుగుదొడ్ల వ్యర్థాలను శుద్ధీకరించేందుకు మరో రూ.4.47 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో రాయదుర్గం పట్టణంలో చెత్త తొలగింపునకు భవిష్యత్తులో వచ్చే చెత్తను శుభ్రపరచడానికి సుమారు రూ.13.03 కోట్లు ఖర్చు చేయగా, ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం రాయదుర్గం అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ.10.27 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాయదుర్గం పట్టణానికి రూ.31.31 కోట్లు మంజూరు కాగా, రూ.8.15 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించారని తెలిపారు. మరో రూ.10.27 కోట్లను రోడ్లు,మురుగునీటి కాలువలు,వీధి దీపాలపై ఖర్చు చేశారని పేర్కొన్నారు. నాడు-నేడు కింద రూ.6.74 కోట్లు,పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరో రూ.2.40 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. వాస్తవాలు, లెక్కలను వివరించేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని, బహిరంగ చర్చకైనా లేదా ఇన్‌కెమెరా సమావేశంలో చర్చించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రాయదుర్గం అభివృద్ధి తెలుగుదేశం పార్టీ సొంతమని,ప్రజల దీవెనలతో,చంద్రబాబు ఆశీస్సులతో రాయదుర్గం పట్టణాన్ని ఇతర పట్టణాలకు ఏ విధంగానూ తీసిపోని విధంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.రాయదుర్గం అభివృద్ధిని కోరుకునే పట్టణ ప్రజలు తమకు తోడుగా ఉండి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టశీకశాల హనుమంతు,మాజీ కౌన్సిలర్లు కడ్డీపుడి మహబూబ్ బాషా,బుదురు తిప్పేస్వామి,రావుత్ రాజశేజర్,భలే శంకర్,గుద్దిటి లోకేష్,మోపురి అశోక్,పోరాళ్ల ధనర్జున,బంగి శంకర్, ఆటో వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి స్కూల్ బస్సు ప్రమాదానికి కారణమైన యాజమాన్యం, డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

శింగనమల,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:అనంతలక్ష్మి స్కూల్ బస్సు ప్రమాదానికి కారణమైన యాజమాన్యం, డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి పి ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో రవాణా శాఖకు సంబంధించి డి టి సి కి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పి ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతిభా భారతి మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామ సమీపంలోని కొండ వద్ద అనంతలక్ష్మి విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు బోల్తా పడిన ఘటన మన జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా,ఒక ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు అదుపుతప్పి బోల్తా పడిందని,ఈ ఘటనలో ఒక విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయని మీకు తెలియజేస్తున్నాము. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం డ్రైవర్ యొక్క తీవ్రమైన నిర్లక్ష్యం మరియు



బాధ్యతారాహిత్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగింది.అనంతలక్ష్మి విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థుల నుంచి ఏటా వేలకు వేలు ఫీజులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ, వారి ప్రాణ రక్షణ మరియు రవాణా భద్రతపై కనీసం చూపకపోవడం అత్యంత విచారకరం. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అనుభవం, వాహనాల పరిమితికి మించిన విద్యార్థుల సంఖ్యపై యాజమాన్యం దృష్టి పెట్టకపోవడమే ఇటువంటి ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజులుగా చెల్లిస్తున్న తల్లిదండ్రులు,పిల్లలు సురక్షితంగా ఇళ్లకు చేరుకుంటారో లేదో అని నిరంతరం భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ ప్రమాదానికి కారకుడైన బస్సు డ్రైవర్‌పై మరియు విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేసిన అనంతలక్ష్మి విద్యా సంస్థల యాజమాన్యంపై తక్షణమే చట్టరీత్యా రవాణా మరియు పోలీసు శాఖల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలి,అంతేకాకుండా అనంతలక్ష్మి విద్యా సంస్థల స్కూల్ బస్సులతో పాటు మిగతా పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వాహనాల పర్మిట్లను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని పి ఎస్ ఎఫ్ ప్రోగ్రెస్ స్టూడెంట్స్ ఫెడరేషన్ తరుపున కోరుతున్నాము.ఈ కార్యక్రమంలో పి ఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

వెలగని హైవే లైట్లు - టోల్ దోపిడీ : ఏఐవైఎఫ్

రాయదుర్గం,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:రాయదుర్గం నుండి గుండ్లపల్లి క్రాస్ వరకు జాతీయ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా హైవే, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావలి కోట్రేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణం లోని కొలిమి వీధిలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గం నుండి వేపరాల క్రాస్ వరకు ఉన్న ఈ హైవేలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలు ఉన్నాయి. ముఖ్యంగా వేపరాల క్రాస్,బ్రిడ్జిలు,స్కూల్స్, కాలేజీలు,హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలు గా హైవే లైట్లు లేవు,బ్రిడ్జిల మీద, క్రాస్ రోడ్ల వద్ద ఎన్ హెచ్ ఎ ఐ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఉండాల్సిన హై-మాస్ట్ లైట్లు, స్ట్రీట్ లైట్లు వెలగడం లేదన్నారు. హెచ్చరిక బోర్డులు లేవు: ప్రమాదకర



మలుపులు, స్కూల్ జోన్,హాస్పిటల్ జోన్,గో స్లో బోర్డులు ఎక్కడా దేవన్నారు. జీబ్రా మార్కింగ్స్ లేవు స్పీడ్ బ్రేకర్ల మీద తెల్లటి జీబ్రా మార్కింగ్స్ (ఐ ఆర్సీ:35 నిబంధన ప్రకారం) వేయ లేదన్నారు. స్పీడ్ బ్రేకర్లు లేవని నాలుగు రోడ్ల కూడళ్లు, ప్రభుత్వ పాఠశాలల ముందు ఐ ఆర్సీ99-2018 ప్రకారం టేబుల్ టాప్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి,కానీ చేయ లేదని పేర్కొన్నారు. ఎన్హెచ్ఎఐ నిబంధనల ప్రకారం హైవే 100% పూర్తయి,సేఫ్టీ ఆడిట్ అయిన తర్వాతనే టోల్ వసూలు చేయాలి.కానీ పనులు పూర్తి కాకుండానే కదరంపల్లి టోల్ గేట్ ప్రారంభించి ఫీజులు వసూలు చేయడం అక్రమమన్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై పదవ తరగతి విద్యార్థి రామ్ చరణ్ తో సహా అనేకమంది ప్రాణాలు కోల్పోయారని తెలియజేశారు.రామ్ చరణ్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, రాయదుర్గం నుండి గుండ్లపల్లి వరకు హైవే లైట్లు వెంటనే వెలిగించాలనీ, హెచ్చరిక,స్కూల్ జోన్, గో స్లో బోర్డులు ఏర్పాటు చేయాలనీ,స్పీడ్ బ్రేకర్లు,జీబ్రా మార్కింగ్స్ వేయాలనీ,హైవే పనులు పూర్తయ్యే వరకు కదరంపల్లి టోల్ వసూళ్లు నిలిపివేయాలనీ,రోడ్డు భద్రతపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హైవే,ఆర్ అండ్ బి అధికారుల కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

మహిళలు ఇంటికే పరిమితం కాకుండా రాజకీయాల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే బండారు శ్రావణి

శింగనమల, సెప్టెంబర్24, దరువు న్యూస్ న్యూస్: బుక్కరాయసముద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2021--2026 కాలానికి ఎంపీపీ పాలకవర్గం పదవీకాలం పూరైన సందర్భంగా వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నమ్మి పనిచేసిన ఎంపీపీ అధ్యక్షురాలు దాసరి సునీత కి,ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి వారు అందించిన సేవలను అభినందించారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా రాజకీయాలు, ప్రజాసేవతో పాటు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పురుషులు అండగా నిలవాలని కోరారు.మహిళలకు అవకాశాలు కల్పిస్తే సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించగలరని అన్నారు.పదవీకాలం పూర్తయినా ప్రజాసేవకు ముగింపు లేదని, భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని సూచించారు.అనంతరం ఎంపీపీ అధ్యక్షురాలు దాసరి సునీత ని,ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం వద్దు సకాలంలో పరీక్షలు, వైద్యం ప్రాణాలను కాపాడతాయి

రాయదుర్గం,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్: జ్వరం వచ్చినప్పుడు సాధారణ జ్వరమని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. రాయదుర్గం అర్బన్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇటీవల 8 ఏళ్ల బాలికకు వచ్చిన తీవ్ర జ్వరాన్ని ఉదాహరణగా వివరించారు.బాలికను ఆవులదొడ్డి పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు నిర్వహించిన సి బి సి పరీక్షలో ప్లేట్‌లెట్లు 26 వేలుగా,హెచ్ సి టి 54 శాతంగా గుర్తించారు. పరిస్థితిని గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేశారు.పరీక్షా నివేదికపై సమాచారం అందుకున్న ఆరోగ్య సిబ్బంది వెంటనే బాలిక కుటుంబాన్ని సంప్రదించి ఆసుపత్రికి వెళ్లాల్సిన ఆవశ్యకతను వివరించారు.అనంతరం రాయదుర్గం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షలో ప్లేట్‌లెట్లు 16 వేలకు పడిపోయినట్లు తేలింది. కుటుంబ సభ్యులు బాలికను బళ్లారికి ఓ పి డి తరలించగా, అక్కడ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందడంతో బాలిక కోలుకుంది.జ్వరం సమయంలో రోగి బయటకు సాధారణంగా కనిపించినప్పటికీ పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, వైద్యులు రెఫర్ చేసినప్పుడు ఆలస్యం చేయరాదని ఆయన



సూచించారు.ప్రభుత్వ పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న ఉచిత రక్త పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యుల సూచన మేరకు తగినంత ద్రవాలు తీసుకోవడం, ఓ ఆర్ ఎస్ వంటి ద్రవాలను వినియోగించడం ముఖ్యమని తెలిపారు.అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులను నివారించవచ్చన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని,ప్రతి వారం 'ఫ్రైడే డ్రై డే' పాటించాలని సూచించారు.కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ,హెల్త్ సెక్రటరీ సుజాత,ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ కార్యాలయం ప్రారంభం

కొత్తచెరువు,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:కొత్తచెరువు మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి జిల్లా నూతన జిల్లా పరిషత్ కార్యాలయం శుక్రవారం ప్రారంభం కానుంది.నూతన జిల్లా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా మంత్రులు ప్రారంభిస్తున్నట్లు కొత్తచెరువు ఎంపీడీవో నటరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.



నూతన జిల్లాల పునర్విభజన తర్వాత కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే జిల్లా పరిషత్ కార్యాలయాన్ని కొనసాగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏ జిల్లాలకు సంబంధించిన జిల్లా పరిషత్ కార్యాలయాలు ఆ జిల్లాలలోనే ఉండే విధంగా ఏర్పాటు చేస్తోంది.దీంతో జిల్లా వాసులకు పెద్ద ఉపశమనం కలిగినట్లంది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యేలు,మంత్రులు హాజరు కానున్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి



కళ్యాణదుర్గం,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:నియోజకవర్గంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది.ఈ మేరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.కళ్యాణదుర్గం నియోజకవర్గం కరువు, వెనుకబాటుతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని అచ్యుత్ ప్రసాద్ పేర్కొన్నారు.నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో డప్పు కళాకారులు,చెప్పులు కుట్టేవారు,దివ్యాంగులు, వితంతువులు తదితర వర్గాలకు చెందిన అనేక మంది పింఛన్లకు అర్హత ఉన్నప్పటికీ, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో పెండింగ్‌లో ఉంచుతున్నారనిక్ ఆరోపించారు.ప్రస్తుతం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 3,260 పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం ఉందన్నారు.అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిశీలించి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలని సీపీఎం తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి - సీపీఎం



తాడిపత్రి,సెప్టెంబర్ 24, దరువు న్యూస్ న్యూస్:తాడిపత్రి నియోజకవర్గంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది.ఈ మేరకు పెద్దపప్పూరు సిపిఎం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.తాడిపత్రి నియోజకవర్గం కరువు, వెనుకబాటుతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని అమ్మలదిన్నె కుళ్లాయప్ప పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో డప్పు కళాకారులు,చెప్పులు కుట్టేవారు, దివ్యాంగులు, వితంతువులు తదితర వర్గాలకు చెందిన అనేక మంది పింఛన్లకు అర్హత ఉన్నప్పటికీ,దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపించారు.ప్రస్తుతం తాడిపత్రి నియోజకవర్గంలో సుమారు 3,500 పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం ఉందన్నారు.అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిశీలించి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలని సీపీఎం తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్ మండల అధ్యక్షుడు సుదర్శన్ మండల కార్యదర్శి రామకృష్ణపాల్గొన్నారు

పాలిటెక్నిక్ విద్యార్థులకు హెచ్ఐవీ, టీబీపై అవగాహన

కళ్యాణదుర్గం,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్:కళ్యాణదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్, క్షయ (టీబీ), లైంగిక వ్యాధులు మరియు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ ఎస్ఏ సి ఎస్) ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, రీడ్స్,కళ్యాణదుర్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా సమాజంలో సమానంగా కలిసిమెలిసి జీవించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అలాగే హెచ్ఐవీ,టీబీ మధ్య సంబంధం, లైంగిక వ్యాధుల లక్షణాలు,చికిత్స, కండోమ్ వినియోగం, హెచ్ఐవీ/ఎయిడ్స్ చట్టం--2017, యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏ ఆర్ టి)మందులు, ఏపీ ఎస్ఏసీఎస్,ఏపీ ఎస్ఏ సి ఎస్ యాప్, హెచ్ఐవీ సంబంధిత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1097 గురించి విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలు,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు.ఈ కార్యక్రమంలో రీడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్,కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి, రీడ్స్ సిబ్బంది వరలక్ష్మి, కిరణ్ కుమార్, నీలావతి,యశోదతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు..

కంబదూరులో వైసీపీ స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం



కంబదూరు,సెప్టెంబర్ 24,దరువు న్యూస్ న్యూస్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కంబదూరు మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం రోజున సన్నాహక సమావేశం నిర్వహించారు. కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి,పార్టీ సీఈసీ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి,ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పదవీకాలం పూర్తయిన జడ్పీటీసీ, ఎంపీపీ,ఎంపీటీసీ సభ్యులను వైసీపీ నాయకులు ఆత్మీయంగా సత్కరించారు.పార్టీ కోసం పనిచేసిన ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి కంబదూరు మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

రాయలసీమ దరువు APTEL/26/A7874

పీపీకేకేలో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై అవగాహన



అనంతపురం, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

పీపీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నేడు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.వెంకట ప్రతాప్‌రెడ్డి ముఖ్య వక్తగా హాజరయ్యారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలు, వాటికి అవసరమైన అర్హతలు, నైపుణ్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యోగ ప్రకటనలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తమ అర్హతలకు తగిన అవకాశాలను గుర్తించడం, విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్ణయించుకొని ప్రణాళికాబద్ధంగా చదవడం వంటి అంశాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. పల్లె వి.కె. కిశోర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు సరైన దిశలో ముందుకు సాగడానికి ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డా. బండి రమేశ్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్నవారు ముందుగానే సన్నద్ధత ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి డా. కె.మనోహర్ రెడ్డి, శిక్షణ, ఉద్యోగ నియామకాల అధికారి వహీదా పాల్గొన్నారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించిన పి.వెంకట ప్రతాప్ రెడ్డికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

పండమేరు వాగు వద్ద అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

అధికారులతో సమీక్షలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

రూ.12.50 లక్షల విలువైన 3చక్రాల వాహనాలు పంపిణీ

ఎమ్మెల్యే సునీతకు కృతజ్ఞతలు తెలిపిన ఎస్‌కేయూ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు





అనంతపురం, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

రాప్తాడు సమీపంలోని పండమేరు వాగు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, అలాగే జేఎన్‌టీయూ నుండి రాప్తాడు వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తయితే జేఎన్‌టీయూ నుంచి రాప్తాడు వైపుకు వెళ్లే ప్రయాణికులకు వాహనదారులకు ఎంతో ఉపయోగం చేకూరనుందన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష అనంతరం రాప్తాడు నియోజకవర్గానికి చెందిన 10 మంది దివ్యాంగులకు వంద శాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటారు వాహనాలను ఎమ్మెల్యే పరిటాల పంపిణీ చేశారు. రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి, అధికారులతో కలిసి ఆమె ఈ వాహనాలను అందజేశారు. ఒక్కొక్క వాహనం విలువ రూ.1.25 లక్షలు కాగా, మొత్తం రూ.12.50 లక్షల విలువైన వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న 200 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు జీ.వో.నెంబర్.5 ద్వారా మినిమం టైం స్కేల్ (మీ) వర్తింపజేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధి పొందిన ఉద్యోగులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి, ఇందుకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల విషయంలో ఈ ప్రభుత్వం ఎప్పటికీ సానుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌కు చెందిన మంజునాథ్ కుమార్తె దుర్గ శ్రీ పుత్తూరులోని అన్నా గౌరీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని దుర్గ శ్రీని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

రూ.7.20 కోట్లతో పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





పుట్టపర్తి, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.7.20 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో సమీపంలో రూ.48 లక్షలతో నిర్మించిన గోకులం మినీ పార్కును ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార పార్కును ప్రారంభించారు. పుట్టపర్తి సంత మార్కెట్ రోడ్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న స్మశానవాటిక ప్రహరీ, మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కర్ణాటక నాగేపల్లి రోడ్డులో రూ.17.50 లక్షలతో మురుగునీటి కాలువ, సీసీ రోడ్డు నిర్మాణానికి, సాయినగర్‌లో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిత్రావతి రోడ్డులో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి భూమిపూజ నిర్వహించారు. అదే ప్రాంతంలో 4.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న బహుళ క్రీడా ఇండోర్ స్టేడియం పనులకు కూడా భూమిపూజ చేశారు. ఎనుములపల్లి ఎస్సీ కాలనీలో రూ.39.70 లక్షలతో, బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. బ్రాహ్మణపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు, పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. బడే నాయక్ తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు బావి తవ్వకానికి, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.23.50 లక్షలతో నూతన బోరు బావుల తవ్వకానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. పుట్టపర్తి నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. పెడబల్లి పంచాయతీలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి సుమారు నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అమడగూరులో రిలయన్స్ సంస్థ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్ల పెట్టుబడితో భారీ సౌర విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, మురుగునీటి కాలువలు, ఆరోగ్యం, క్రీడా రంగాల్లో చేపడుతున్న పనులతో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాల కొన సాగింపుపై ప్రజలు తమ నిర్ణయం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా.. సత్వర న్యాయమే లక్ష్యం

- దాడులు జరిగితే కఠిన చర్యలు.. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై ఎలాంటి దాడులు జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. దాడులు జరిగిన సందర్భాల్లో బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన అందించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, మాన్యువల్ స్కావెంజర్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, వారికి అందుతున్న న్యాయపరమైన సహాయం, పరిహారం, సంబంధిత కేసుల పురోగతిపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 8న రెవెన్యూ భవన్‌లో ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార దినం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. అలాగే ప్రతి నెల చివరి తేదీన రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖతో పాటు మండల స్థాయి అధికారుల సమన్వయంతో పౌర హక్కుల దినాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డీఆర్వో కొండయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, ఆర్డీఓలు, ఎస్‌డీపీఓలు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ పార్టనర్‌షిప్ సుమ్మిట్-2026కు అన్ని విధాలా సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం సాయంత్రం ఇన్వెస్ట్‌మెంట్ పైప్ లైన్, పార్టనర్ షిప్ సమ్మిట్-2026 సన్నద్ధత, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస యాదవ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూలో వచ్చే అక్టోబర్ 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీ ఈ డిబి) ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సిఐఐ (కాన్ఫడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్టనర్‌షిప్ సుమ్మిట్ - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ కోసం అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. పార్టనర్‌షిప్ సుమ్మిట్ - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ కోసం అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నగరంలోని జేఎన్‌టీయూలోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, జేఎన్‌టీయూ అతిథి గృహంలో, ఇతర అన్ని చోట్లా పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. కార్యక్రమానికి వచ్చే డెలిగేట్ల కోసం ఏర్పాట్లు చేపట్టాలని, భోజన ఏర్పాట్లు, పోలీస్ సెక్యూరిటీ, షామియానాలు, జర్మన్ హ్యాంగర్స్‌లో ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు, తదితర అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం కోసం జిల్లాలో ఎంఎస్ఎంఈలను గుర్తించడం చేయాలని, ఆయా మేజర్ కంపెనీలకు అవగాహన కల్పించాలన్నారు. రీజనల్ కాన్ఫరెన్స్ కోసం అవసరమైన ప్రొసీడింగ్స్ అన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో పైలాన్ ఆవిష్కరణ కోసం ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పార్టనర్ షిప్ సమ్మిట్ కోసం సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, నెడ్ క్యాప్ మేనేజర్ కిరణ్, ఏపీఐఏసీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఏ డిమాండ్లను పరిష్కరించకపోతే..

ఆందోళన నిరసనలను ఉధృతం చేస్తాం

- మడకశిరలో 9వ రోజు వీఆర్ఏలు అర్ధనగ్న నిరసన



మడకశిర, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

విఆర్ఏల న్యాయ సమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం స్పందించి పరిష్కరించక పోతే మాత్రం తాము చేపట్టిన సమ్మె, నిరసన, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మడకశిర మండలం విఆర్ఏల సంఘం అధ్యక్షుడు బాలు, ఉపాధ్యాయక్షుడు మణురు తలారి శివలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కెల్ ఇవ్వాలని, అర్హులైన విఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, నామినిలుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ వీఆర్ఏలుగా నియమించాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏ సంఘం కార్యదర్శులు ప్రభాకర్, పరమేష్, కార్యవర్గ సభ్యులు, మండలంలోని విఆర్ఏలు పాల్గొన్నారు.

జై జై గణేశా బాయ్ బాయ్ గణేశా

- మడకశిరలో కన్నుల పండుగగా గణేష్ నిమజ్జన వేడుకలు - భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర - గణపతి బప్పా మోరియా నినాదాలతో మార్మోగిన మడకశిర





మడకశిర, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

మడకశిర పట్టణంలో గురువారం జై జై గణేశా బాయ్ బాయ్ గణేశా అంటూ భక్తుల నినాదాలతో డప్పుల దరువులతో యువత కేరింతలు భక్తుల నృత్యాలతో మడకశిర పట్టణం గణేశ్ నామస్మరణతో మార్మోగింది. గణేష్ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. అనంతరం అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను ఉంచి శోభాయాత్రగా తరలించారు. శోభాయాత్రలో చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల మోతకు యువత చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గణపతి బప్పా మోరియా.. జై జై గణేశా.. అంటూ భక్తులు చేసిన నినాదాలతో మడకశిర వీధులు మార్మోగాయి. పలుచోట్ల భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చి, పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. గణనాథుడి నిమజ్జనాన్ని పురస్కరించుకుని పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. కుటుంబ సమేతంగా ప్రజలు శోభాయాత్రను వీక్షించేందుకు తరలివచ్చారు. గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా సంబంధిత అధికారులు, పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. భక్తుల జైజై ధ్వానాలు, డప్పుల దరువులు, యువత ఉత్సాహం, గణనాథుడి నిమజ్జన ఘట్టంతో మడకశిరలో గణేష్ ఉత్సవాలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

అంగన్వాడీ ఉత్సవాలను జయప్రదం చేయండి

- గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ రహమ్మతీయ



అమరాపురం, సెప్టెంబర్ 24, దరువు న్యూస్ :

ఇదే నేల 25నుండి అక్టోబర్ 07వరకు ఐసీడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంగన్వాడీ ఉత్సవాలను జయప్రదం చేయాల్సిందిగా ఐసీడిఎస్ గుడిబండ ప్రాజెక్టు సీడీపీఓ ఎస్.రహమ్మతీయ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూపరి పాలనలో భాగంగా ఐసీడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంగన్వాడీ ఉత్సవాలను ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో ఉత్సవాలను నిర్వహించాలని, కనీసం మూడు రోజులైనను తప్పకుండ ఉత్సవాలు నిర్వహించాలన్నారు.ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు అందిస్తున్న సేవలు పట్ల ప్రజలకు స్పష్టంగా వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్త, ఆయాలకు ప్రోత్సాహక బహుమతులను అందించడం జరుగుతుందన్నారు.ముఖ్యంగా ఈ ఉత్సవాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారం,ఆరోగ్య సేవలు గురించి లబ్ధిదారులతో వేదికపై మాట్లాడించాల్సిందిగా సీడీపీఓ రహమ్మతీయ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ సన్నక్క తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.